క్లుప్తంగా

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



కర్లపాలెం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకే దక్కుతుందని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు అన్నారు. కర్లపాలెం మండలం పెదగొల్లపాలెం పంచాయతీ నక్కలవానిపాలెం గ్రామంలో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ పార్టీ నాయకులతో కలసి ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని స్థాపించిన అనతి కాలంలోనే అఖండ మెజార్టీతో అధికారం చేపట్టి ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలోని పేదలకు కూడు, గూడు, బట్ట అందించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి, బాపట్ల పార్లమెంటు పరిశీలకుడు, అద్దంకి మాజీ ఎమ్మెల్యే చెంచు గరటయ్య, కర్లపాలెం మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గుంట్రెడ్డి శివ, నాయకులు ఏపూరి భూపతిరావు, పమిడి భాస్కర రావు, నక్కల వెంకటస్వామి, మానం విజేత, పల్లం సరోజిని, పమిడి రాజు, జనసేన పార్టీ సమన్వయ కర్త శివన్నారాయణ, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాతావారిపాలెంలో మినరల్ వాటర్ సరఫరా



తాతావారిపాలెం (భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం సూరేపల్లి పంచాయతీ పరిధిలోని తాతావారిపాలెంలో వైరల్ జ్వరాలు ప్రబలడంతో పంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధులు అప్రమత్తమై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు రోగాల బారిన పడకుండా గ్రామంలోని ప్రతి ఇంటికి మినరల్ వాటర్ క్యాన్ అందించేందుకు సర్పంచ్ మోర్ల విజయలక్ష్మి ముందుకు వచ్చారు. పరిస్థితి అదుపులోకి వచ్చే వరకు వాటర్ క్యాన్లు సరఫరా చేయనున్నట్లు ఆమె ప్రకటించారు. పంచాయతీ కార్యదర్శి టి.అనురాధ పర్యవేక్షణలో పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతను ప్రజలకు తెలియజేస్తున్నారు. భట్టిప్రోలు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యులు శిబిరాన్ని కొనసాగించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తున్నారు. గ్రామంలో జ్వరాలు అదుపులోకి వచ్చేవరకు వైద్య శిబిరం కొనసాగనుంది.

పాముకాటుతో వ్యక్తి మృతి



రేపల్లె రూరల్: పాము కాటుతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని మోర్లవారిపాలెం పంచాయతీ తురకపాలెంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు బెల్లంకొండ వెంకటేశ్వరరావు ఎప్పటి మాదిరిగానే తన గొడ్లచావిడిలో పశువులకు మేత వేసేందుకు వెళ్లగా అక్కడే ఉన్న పాము కాటువేసింది. దీంతో వెంకటేశ్వరరావును కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఘర్షణలో ఇరువురిపై కేసులు నమోదు

బాపట్లటౌన్: పట్టణంలోని రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న ఇరువర్గాలు ఒకరిపై మరొకరు ఘర్షణకు దిగిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉండే జువ్వాది పద్మ, ఆమె భర్త నాగేశ్వరరావులు అదే ప్రాంతానికి చెందిన పమిడి పద్మ, శ్రీవల్లి గురించి వేరే వ్యక్తులకు చెడుగా చెబుతున్నారని, ఇదేమని అడగటానికి వెళ్లినందుకు మాపై దాడిచేశారని పమిడి పద్మ ఫిర్యాదు చేశారు. వాళ్ల గురించి ఎవరికీ ఏమీ చెప్పకపోయినా కావాలనే ఇంటిపై కొచ్చి దుర్భాషలాడి మాపై దాడి చేశారని జువ్వాది పద్మ ఫిర్యాదు చేశారు. ఇరువురి ఫిర్యాదులపై పట్టణ పోలీసులు కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

తమ్ముడి కూతురిపై పెదనాన్న దాడి

బాపట్లటౌన్: తమ్ముడు కూతురుపై పెద్దనాన్న, పెద్దమ్మ ఇనుపరాడ్డుతో దాడిచేసిన ఘటన మండలంలోని దరివాదకొత్తపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం దరివాదకొత్తపాలెం గ్రామంలో బాధితురాలు నివాసం ఉండే గృహానికి పై భాగంలో ఆమె పెద్దనాన్న కోకి కోటేశ్వరరావురెడ్డి, పెద్దమ్మ రమాదేవిలకు చెందిన గృహం ఉంది. వారి వాడుకనీరు బాధితురాలి గృహంలోకి వస్తుండటంతో రాకుండా ఇసుక అడ్డువేసి నందుకు శనివారం సాయంత్రం ఇనపరాడ్డుతో దాడి చేశారని బాధితురాలు వాపోయింది. రెండు రోజులుగా హాస్పటల్‌లో ఉన్నప్పటికీ వైద్యశాలలోని అవుట్‌పోస్ట్ పోలీసులు ఫిర్యాదు తీసుకోలేదని తెలిపింది.

భక్తి ప్రపత్తులతో గురుపౌర్ణమి వేడుకలు

గురుపౌర్ణమి పర్వదినాన్ని వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఆదివారం వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. సాయి నామస్మరణతో ఆలయ పరిసర ప్రాంతాలు మార్మోగాయి. బాబావారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పలు చోట్ల నిర్వహించిన అన్నసంతర్పణ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

- బాబా ఆలయాలకు భక్తుల తాకిడి
- ప్రత్యేక అభిషేకాలు, పూజాదికాలు
- పలు చోట్ల అన్న సంతర్పణలు



గోవాడలో స్వర్ణ శ్రీనివాస శర్మను సన్మానిస్తున్న శిష్య బృందం

అమృతలూరు(భట్టిప్రోలు): తల్లిదండ్రులు జన్మనిస్తే జ్ఞాన భిక్షతో పునర్జన్మ నిచ్చి జీవితానికి సార్థకత నిచ్చేది గురువేనని జిల్లా అర్చక సేవా సంఘం అధ్యక్షులు, సహస్ర ప్రతిష్టాచార్యులు స్వర్ణ శ్రీనివాస శర్మ అన్నారు. గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం అమృతలూరు మండలం గోవాడ గ్రామంలో కొలువైన శ్రీ బాలకోటేశ్వర స్వా మి దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రీనివాస శర్మను ఆయన శిష్యబృందం ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ జ్ఞానం అంటే అద్భుతమైన విషయం ఏమీ కాదన్నారు. తెలియని విషయాన్ని మరింత క్షుణ్ణంగా పరిశీలించి అవగాహన చేసుకోవడమేనని అన్నారు. ఎస్ఎస్ఎఫ్ బాపట్ల జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ, సహ అర్చకులు చావలి శ్రీధర్ శర్మ, పొన్నపల్లి శివరామశర్మ, మోహన్, సుబ్బారావు, అన్నదానం లోకేష్, భక్త బృందం పాల్గొన్నారు.

సాయి నామస్మరణతో మార్మోగినఆలయాలు

కొల్లూరు: సాయి నామస్మరణతో బాబా ఆలయాలు మార్మోగాయి. భక్తుల కోలాహలంతో ఆలయాలు నిండిపోగా, సాయిబాబా ఆలయాలకు వెళ్లే మార్గాలు జన సందోహంగా మారాయి. ఆదివారం గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని కొల్లూరు, పోతార్లంకలోని సాయిబాబా ఆలయాలలో భక్తులు బాబాను దర్శించుకొని భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. పూజారులు సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి ఆలయాలకు భారీ సంఖ్యలో తరలి వచ్చిన భక్తుల పూజలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు సాయిబాబా కీర్తనలు ఆలపిస్తూ చేపట్టిన భజనా కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సర్వమతాల ప్రజలు బాబా ఆలయాల బాట పట్టడంతో ఆలయ ప్రాంతాలు జన సందోహంతో నిండిపోయాయి. పోతార్లంక, కొల్లూరు ఆలయాల్లో గురుపౌర్ణమి సందర్భంగా భక్తులకు ఆలయ నిర్వాహక కమిటీల నేతృత్వంలో అన్న సంతర్పణ జరిపారు.

ఆలయాలలో భక్తులకు అన్నదానం

కర్లపాలెం: గురుపౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం కర్లపాలెంలోని సత్యసాయి గ్రామీణ సేవా సమితిలో షిరిడీ సాయిబాబా విగ్రహానికి, సత్యసాయి చిత్ర పటాలకు భక్తులు పూజలు నిర్వహించారు. గణపవరం, యాజలి గ్రామాలలోని షిరిడీ సాయి ఆలయాలలో గురుపౌర్ణమి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. రామకృష్ణ సేవా సమితిలో విశేష పూజలు జరిగాయి. గురుపౌర్ణమిని పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు విచ్చేసి పూజలు చేశారు. కర్లపాలెం, గణపవరం, యాజలి సాయిబాబా దేవాలయాలతో పాటు సత్యసాయిబాబా ఆలయంలో భక్తులకు అన్న సంతర్పణ చేశారు. ఈ కార్యక్రమాలలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

రేపల్లె రూరల్: గురుపౌర్ణమి పర్వదినాన్ని ఆదివారం పట్టణంలోని బాబా ఆలయాల్లో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే సాయినాథుని విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి పువ్వులు, పట్టువస్త్రాలతో అలంకరించారు. సాయినాథునికి అన్నాభిషేకం చేశారు. చినకూరగాయల మార్కెట్ సెంటరు, రామకోటిపేట, ఇసుకపల్లిలలోని బాబా ఆలయాలతో పాటు పేటేరు, బావాజీతోటలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు బాబావారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆయా ఆలయాల కమిటీ సభ్యులు భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు.

బాబావారికి విశేష పూజలు

నగరం: గురుపౌర్ణమి పర్వదిన వేడుకలను ఆదివారం మండలంలోని ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని ఈదుపల్లి శివారు సాయినగర్‌లోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. వేకువ జాము నుంచే ఆలయంలో బాబావారికి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా వేద పండితులు మేలుకొలుపు, కాగడ హారతి, అభిషేకాలు, సాయి దత్తహోమం వంటి పూజా కా ర్యక్రమాలను శాస్త్రయుక్తంగా జరిపించారు. భక్తు లు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. బాబావారికి పలు రకాల పూలతో ప్రత్యేక అలంకరణలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. దూళిపూడిలోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

బాబాకు ఏకాదశ రుద్రాభిషేకం

భట్టిప్రోలు: భట్టిప్రోలు సాయిబాబా మందిరంలో నిర్వహిస్తున్న సాయినాథ–దత్తాత్రేయ స్వామి వార్ల గురుపౌర్ణమి వేడుకలలో భాగంగా ఆదివారం రెండవ రోజు బాబా వారికి సుప్రభాతం, కాకడహారతి, ఏకాదశ రుద్రాభిషేకం, అష్టోత్తర పూజలు జరిగాయి. పూజా కార్యక్రమాలలో మద్దుల కిరణ్‌తేజ–రామలక్ష్మి కల్కి దంపతులు, కొశిపల్లి బాలాజి సత్యకుమార్‌లు పాల్గొన్నారు. మధ్యాహ్నం జరిగిన నారాయణ సేవలో కుల మతాలకు అతీతంగా 1500 మంది భక్తులు పాల్గొన్నారు. కమిటీ అధ్యక్షులు తమ్మన రమేష్ బాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు. పూ జా కార్యక్రమాలను వేద బ్రాహ్మణులు మురికిపూడి దుర్గాప్రసాద్ శాస్త్రయుక్తంగా నిర్వహించారు. కార్యదర్శి మెంటా సాంబశివరావు, కోశాధికారి బూర్లె కిరణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గురువులకు సత్కారం



చెరుకుపల్లి బాబా మందిరంలో గురువులకు సత్కారం



చెరుకుపల్లిలో భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ

చెరుకుపల్లి: ఆషాఢ శుద్ధ పౌర్ణమి(గురు పౌర్ణమి) వేడుకలు మండలంలోని షిరిడీ సాయిబాబా వారి ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని వీర రాఘవపేటలో వేంచేసియున్న శ్రీ షిరిడీ బాబా మందిరానికి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు, ఉదయం ఆరు గంటలకే బాబా వారి విగ్రహాన్ని పట్టు వస్త్రాలు, వివిధ రకాల పూలు, పండ్లతో అలంకరించారు. ఆలయ ప్రాంగణమంతా విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి పలు రకాల పళ్ల రసాలతో అభిషేకించారు. ఆలయ ప్రధాన అర్చకులు మల్లెల కృష్ణమూర్తి ఆలయానికి వచ్చిన పలువురు పుణ్య దంపతులకు, భక్తులకు వారివారి గోత్ర నామాలతో అభిషేకాలు నిర్వహించారు. కావూరు వినయాశ్రమం ఆయుర్వేద వైద్యులు డాక్టర్ గొల్లపూడి సీతారామకుమార్, సీనియర్ పాత్రికేయుడు వేదాంతం సూరిబాబు, విశ్రాంత ఉపాధ్యాయులు కె.రోశయ్య, ఆర్‌వీఎస్ ఆంజనేయ శర్మతో పాటు పలువురు గురువులను కమిటీ సభ్యులు సత్కరించారు. పలు రకాల ప్రసాదాలను భక్తులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో శ్రీ షిరిడీసాయి బాబా ఆలయ కమిటీ అధ్యక్షులు రావూరి ఆంజనేయులు, దివి రాంబాబు, మారిశెట్టి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సాధన మండలిలో వ్యాస మహర్షికి పూజలు



భట్టిప్రోలులో పూజలు నిర్వహిస్తున్న సాధన మండలి నిర్వాహకులు

భట్టిప్రోలు: భట్టిప్రోలు సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా వ్యాస మహర్షికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ అధ్యక్షురాలు బూర్లె అరుణకుమారి గురుపౌర్ణమి ఆవశ్యకతను భక్తులకు విశదపరిచారు. కార్యక్రమంలో నిర్వాహకులు వంగర నాగేశ్వరరావు, బండి వెంకట్రావు, పానుగంటి సూరిబాబు, జంజనం హేమశంకరరావు, మాటూరి సుజాత, పులికొండ దేవసేన ఆం దాళ్, సీతారత్నం, బి.వెంకటలక్ష్మి, బి.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



భట్టిప్రోలులో సాయినాథునికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కొల్లూరు బాబా ఆలయంలో నామస్మరణ చేస్తున్న భక్త బృందం



రేపల్లె బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



ఈదుపల్లి సాయినగర్‌లో బాబాకు ప్రత్యేక అలంకరణ



కర్లపాలెంలో షిర్డీసాయికి ప్రత్యేక అలంకరణ

అక్రమ మద్యం అమ్మకాలు.. అరికట్టేవారు ఎవరు..?

- వేమూరు నియోజకవర్గంలో జోరుగా అక్రమ మద్యం అమ్మకాలు
- చోద్యం చూస్తున్న సంబంధిత శాఖాధికారులు



వేమూరు: కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత బెల్టు షాపులు గ్రామాల్లో పుట్టగొడుగుల్లా దర్శనమిస్తున్నాయి. మద్యం బెల్టు షాపుల నిర్వాహకులు పగలు, రాత్రి తేడా లేకుండా విచ్చలవిడిగా అమ్మకాలు చేస్తున్నారు. ప్రతి గ్రామంలో రెండు లేదా మూడు బెల్టు షాపులు కొనసాగుతున్నాయి. ఈ దుకాణాలన్నీ ఆయా గ్రామాల్లోని కూటమి నాయకులు, కార్యకర్తలు కనుసన్నల్లో కొనసాగుతున్నాయి. బెల్టు షాపులు, అక్రమ ఇసుకను అరికట్టేందుకు ప్రభుత్వం స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో స్టేషన్లు ఏర్పాటు చేసింది. కూటమి నాయకులు, కార్యకర్తలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు భయపడి బెల్టు షాపుల వైపు కన్నెత్తి చూడటం లేదని బహిరంగంగా విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో బెల్టు షాపుల్లో మద్యం ఏరులై పారుతుంది. వేమూరు నియోజకవర్గంలో వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాలు ఉన్నాయి. నియోజకవర్గంలో ప్రభుత్వ మద్యం దుకాణాలు 12 వరకు కొనసాగుతున్నాయి. నియోజకవర్గ పరిధిలో 86 గ్రామాలు ఉన్నాయి. వీటిలో సుమారు 200 బెల్టు షాపులు కొనసాగుతున్నాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బెల్టు షాపు నిర్వాహకులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు బెల్టు షాపులు ఏర్పాటు చేయాలంటే భయపడే పరిస్థితి ఉండేది. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గ్రామాల్లో మెరుపు దాడులు చేసేవారు. ఈ దాడుల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలకు చెందిన పలు బెల్టు షాపులపై కేసులు నమోదు చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు టీడీపీ నాయకులకు భయపడి బెల్టు షాపుల నిర్వాహకుల వద్దకు వెళ్లేందుకు సైతం భయపడుతున్నారు.

గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం



గ్రామాల్లో బెల్టు షాపుల నిర్వాహకులు విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేపడుతున్నారు. నిర్వాహకులపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. బెల్టు షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి.

– సిద్దెల రాజకిషోర్, స్థానికుడు,పెనుమర్రు.

స్పందించేవారు లేరు..



మద్యం బెల్టు షాపుల నిర్వాహకులపై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదు. వేమూరు నియోజకవర్గంలో బెల్టు షాపులు ఎథేచ్ఛగా కొనసాగుతున్నా యి.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బెల్టు షాపులు నియంత్రణలో ఉండేవి. ప్రస్తుతం నిర్వాహకులు బహిరంగంగానే విక్రయాలు చేపడుతున్నారు.

– తాడి బోయిన అంకమ్మరావు, జంపని.

దాడులు నిర్వహిస్తాం

నియోజకవర్గంలో బెల్టు షాపులు నిర్వహిస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. మద్యం బెల్టు షాపుల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకొనేందుకు ప్రభుత్వం కొన్ని మార్పులు తీసుకొని రావడం జరిగింది. మద్యం బెల్టు దుకాణాలపై దాడులు నిర్వహిస్తాం.

–గంగాధర్, ఇన్‌చార్జి సీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, వేమూరు.

భవనాలు నిరుపయోగం.. జూదరులకు నిలయం



అడవిని తలపిస్తున్న కోర్టు ప్రాంగణం



నిరుపయోగంగా పాత కోర్టు భవనం

- అడవులను తలపిస్తున్న పాత కోర్టు ప్రాంగణం
- నిరుపయోగంగా మారటంతో హెచ్చుమీరుతున్న అసాంఘిక కార్యకలాపాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు

బాపట్లటౌన్: గతంలో పట్టణ నడిబొడ్డున నిర్మించిన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాలు ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. పట్టణంలోని సూర్యలంక రోడ్డులో బాలికల జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల, మహిళా డిగ్రీ కళాశాలలకు ఎదురుగా గతంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నిర్వహించేవారు. 2005లో పట్టణంలోని నరాలశెట్టివారిపాలెంలో నూతనంగా సీనియర్ సివిల్‌జడ్జి కోర్టు భవనాన్ని నిర్మించడంతో అప్పటి నుంచి కోర్టు కార్యకలాపాలు అక్కడే నిర్వహిస్తున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

సుమారు 15 ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న కోర్టు భవనాల సముదాయం ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. మందుబాబులు వీరంగం చేయడంతో పాటు రాత్రి సమయంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన కూడలి ప్రాంతం కావడం, అక్కడే విద్యాలయాలు, దేవాలయం, ఉంది. త్వరలో ప్రారంభించనున్న అన్నా క్యాంటీన్ కూడా ఇక్కడే ఏర్పాటు చేస్తున్నారు. దీంతోపాటు కోర్టు ప్రాంగణంలో ముళ్ల చెట్లు విపరీతంగా పెరిగి అడవులను తలపిస్తున్నాయి. చెట్ల కారణంగా విషసర్పాలు, పందులు, కోతులు అధికంగా వస్తున్నాయని సమీపంలోని నివాస గృహాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోర్టు ప్రాంగణాన్ని పరిశుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కోర్టు అధికారులతో చర్చిస్తాం

నిరుపయోగంగా మారిన కోర్టు సముదాయాలపై కోర్టు అధికారులతో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటాం. అసాంఘిక కార్యకలాపాలు వంటి వాటిని అరికట్టేందుకు పోలీసు శాఖ సహకారంతో చర్యలు చేపడతాం. త్వరలో సమస్య పరిష్కారం చేసేందుకు కృషి చేస్తాం.

– నిర్మల్ కుమార్, మున్సిపల్ కమిషనర్, బాపట్ల

శాకంబరి అలంకరణలో బూరుగులమ్మ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రేపల్లె రూరల్: ఆషాఢ శుద్ధ పౌర్ణమి సందర్భంగా గ్రామదేవత శ్రీ బూరుగులమ్మ అమ్మవారి దేవాలయంలో ఆదివారం ఆలయ అర్చకుడు నందివెలుగు భాను సుధాకర్ గురుకులు ఆధ్వర్యంలో శాకంబరీదేవి ఉత్సవాలు నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి సుప్రభాత సేవ, పండ్ల రసాలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పట్టువస్త్రాలు, కూరగాయలతో ప్రత్యేక అలంకారం చేశారు. అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శనం చేసుకుని పసుపు, కుంకుమ, పువ్వులు, పండ్లు, నూతన వస్త్రాలతో పాటు కూరగాయలు, చద్దినైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



రేపల్లెలో శాకంబరిగా దర్శనమిస్తున్న బూరుగులమ్మ

నేటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ సప్తాహ్

వేమూరు: నేడు మండల పరిషత్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శిక్షణ సప్తాహ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మండల విద్యాశాఖాధికారి ఐ వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ జాతీయ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 22 నుంచి 29 వరకు ఈ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. వారం రోజుల పాటు అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ నిర్వహించాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు పంపించడం జరిగిందని చెప్పారు.

శ్రీ శారదాంబ అమ్మవారికి శాకంబరి అలంకరణ



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామం శ్రీ శంకరమఠంలో కొలువైన శ్రీ శారదాంబ అమ్మవారిని ఆషాఢ మాసం పౌర్ణమి సందర్భంగా ఆదివారం అమ్మవారి మూలవిరాట్‌ను కూరగాయలతో శాకంబరిదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. అర్చకులు క్రోవి శ్రీరామచంద్రమూర్తి (చందూ మాస్టార్) అమ్మవారిని శాకాంబరి దేవిగా అలంకరించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. గ్రామంలో పాడి పంటలు పుష్కలంగా పండి అన్నదాతలు సంతోషంగా ఉండాలని, వృత్తి, వ్యాపారాలు బాగుండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి అలంకారాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.